www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 26 ఫిబ్రవరి 2024

నేడు స్పందన, డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు తెలిపారు. నగర ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884 2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. అలాగే 10:30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

సమస్యల వలయంలో జిజిహెచ్

- రోగులకు తప్పని అవస్థలు
- తూతూమంత్రంగా హెడిఎస్ సమావేశాలు
- చేసిన ప్రతిపాదనలు బుట్టదాఖలు
- ప్రభుత్వంపై ఒత్తిడి చేయని ప్రజాప్రతినిధులు

అత్యవసర విభాగంలో ఒకే మంచం పై ఇద్దరు రోగులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి పేద ప్రజల ఆరోగ్యానికి పెద్ద భరోసాగా నిలుస్తుంది. అయితే కొన్నేళ్లుగా సమస్యల వలయంలో చిక్కుకుని విలవిలాడుతోంది. అసౌకర్యాల చెరలో కొట్టుమిట్టాడుతుంది. ఆసుపత్రిలో కీలక సమస్యల పరిస్కారానికి ఆయువు పట్టుగా నిలవాల్సిన ఆసుపత్రి అభివృద్ధి మండలి (హెచ్‌డిఎస్) ఉన్నా తూతూ మంత్రంగా మాత్రమే సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న హెచ్‌డిఎస్ ఉన్నా సామాన్యులకు అవస్థలు తప్పడంలేదు.

చుట్టుముడుతున్న సమస్యలు

1165 పడకలు ఉన్న ఈ ఆసుపత్రిలో సుమారు 2 వేల మంది ఇన్ పేషేంట్లుగా ఉంటూ ప్రతీ రోజూ చికిత్స పొందుతున్నారు. అయితే సరిపడినన్ని పడకలు లేకపోవడంతో ఒకే మంచంపై ఇద్దరు, ఒక్కో సందర్భంలో ముగ్గురు రోగులను ఉంచుతున్నారు. అత్యవసర చికిత్స విభాగంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. విధి లేని పరిస్థితుల్లో ఒకే మంచంపై ఇద్దరూ, ముగ్గురు రోగులకు వైద్యులు చికిత్సను అందిస్తున్న దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితి ఎప్పటికీ మారుతుందో అటు రోగులకు, ఇటు వైద్యాధికారులకు అంతు పట్టడం లేదు. అలాగే లిఫ్ట్ సౌకర్యం ఉన్నా ప్రస్తుత మరమ్మతులకు గురవడంతో రోగులు మొదటి అంతస్తులోకి వెళ్లాలంటే నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. వారి బంధువులు పలు సందర్భాల్లో మోసుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రి ఆవరణలో గత నాలుగేళ్లుగా నిర్మిస్తున్న ఎంసిహెచ్ బ్లాకు ఇంకా పూర్తి కాలేదు. నిధుల విడుదలలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుండడంతో కాంట్రాక్టర్లు నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేశారు. ప్రస్తుతం కొంతకాలంగా పనులు సాగుతున్నా ఎప్పటికీ అందుబాటులోకి వస్తుందో స్పష్టత లేదు. ఈ బ్లాకు పనులు గనక పూర్తయితే తల్లి బిడ్డలకు సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. కార్డియాలజీ చికిత్స కోసం ప్రత్యేకంగా విభాగాన్ని నిర్మించినప్పటికీ గుండె వ్యాధితో వస్తున్న పేదలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. కార్డియాలజీ విభాగానికి చెందిన వైద్యులకు స్వయం ప్రతిపత్తి కల్పించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ విభాగంపై అవగాహన లేని మెడిసిన్ హెచ్‌ఒడి కంట్రోల్‌లో పనిచేస్తుండడం వలన సంతృప్తి స్థాయిలో గుండె వ్యాధి నిపుణులు వైద్య సేవలు అందించలేకపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. కాథ్‌ల్యాబ్ అందుబాటులో ఉన్నా పూర్తిస్థాయి సేవలు అందించకపోవడంతో రోగులు వెను తిరుగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య సేవలు కూడా అందుబాటులోకి రావాల్సి ఉంది. అలాగే ఎంఆర్ఐ, సిటీ స్కాన్లు చేస్తున్నప్పటికీ సకాలంలో రిపోర్టులు ఇవ్వలేకపోతున్నారు. దాంతో వైద్య సేవలు అందించడంలో జాప్యం చోటు చేసుకుంటుంది. ఇలా అనేక సమస్యలు ఏళ్ల తరబడి వేధిస్తున్నా అధికారులు ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు.

కొత్తగా నిర్మించిన కాథ్ ల్యాబ్ లో పూర్తిస్థాయిలో అందని సేవలు

తూతూ మంత్రంగా సమావేశాలు

రోజుకి 3 వేల నుంచి 3,500 మంది మంది రోగులు వచ్చే కాకినాడ జిజిహెచ్‌లో సమస్యలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. జబ్బులతో వచ్చే రోగులకు వైద్యసేవలు అందించడంలో లోనూ, పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఆసుపత్రిలో నెలకున్న సమస్యలను గుర్తించి, తగు చర్యలను చర్చించి వాటి పరిష్కారానికి గతంలో గట్టి కృషి జరిగేది. జిల్లా కలెక్టర్ చైర్మన్ గా, జిజిహెచ్ సూపరింటెండెంట్ కన్వీనర్‌గా 2014కి ముందు ఆసుపత్రి అభివృద్ధి మండలి సమావేశాలు 3 నెలలకోసారి జరిగేవి. హెచ్‌డిఎస్ సమావేశానికి ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ఎంపిలు, జడ్‌పి చైర్మన్ విధిగా హాజరయ్యేవారు. వీరితోబాటు జిజిహెచ్‌లో హెచ్‌ఒడిలు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సభ్యులుగా ఉన్నారు. అయితే ప్రస్తుతం హెచ్‌డిఎస్ సమావేశాలు 4 నెలలకోసారి జరుగుతున్నాయి. ఈ సమావేశాలు నిర్దిష్టమైన సమయానికి కాకుండా జరుగుతున్నా నామ్‌కే వాస్తే అన్నట్లుగా సాగుతున్నాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చేసిన పనులను ప్రస్తావిస్తూ, చేయబోయే అభివృద్ధి పనులను గురించి చర్చించడం, అందుకు అవసరమైన నిధులకు సంబంధించి ప్రతిపాదనలు చేయడం వరకూ మాత్రమే హెచ్‌డిఎస్ సమావేశాలు ఉంటున్నాయనే వాదన లేకపోలేదు. ఆ ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్లు పరిస్థితి ఉంది. ప్రస్తుతం 1165 పడకలు కల్గిన జిజిహెచ్‌లో ముందు 1500కు, తర్వాత 1900కు, చివరకు 2,300కు పడకల స్థాయిని పెంచాలని తీర్మానాలను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనలను అమలు చేయించుకోవడం కోసం ప్రభుత్వంపై ఒత్తిడిని తీసుకురావాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు హెచ్‌డిఎస్ సమావేశాలను తూతూ మంత్రంగా జరుపుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ఆసుపత్రి సూపరింటెండెంట్, హెచ్‌ఒడిలు మాత్రమే సమావేశాలను జరిపి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు.

జగ్గంపేటలో పరీక్షా కేంద్రానికి వెళ్తున్న అభ్యర్థులను తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

-86 శాతం అభ్యర్థులు హాజరు

ప్రజాశక్తి - కాకినాడ, జగ్గంపేట

జిల్లాలో 52 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా ప్రశాంతంగా జరిగాయని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-2 ఉద్యోగాల నియామకం కోసం ఆదివారం నిర్వహించిన స్క్రీనింగ్ టెస్టుకు సంబంధించి జిల్లాలోని 52 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 24,489 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 20,951 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. 3,538 మంది పరీక్షకు హాజరు కాలేదని, దీంతో అభ్యర్థుల హాజరు 86 శాతంగా నమోదైందన్నారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా పరీక్ష ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పర్యవేక్షించాయన్నారు. జగ్గంపేటలోని స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలతోపాటు, అక్షర జూనియర్ కళాశాలను, భాష్యం స్కూల్, శ్రీ చైతన్య స్కూల్లో గ్రూప్ - 2 పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారని, హాజరైన అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు.

మార్చి 1న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - కోటనందూరు

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కార్మికులు

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 1న జరిగే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఎపి వర్కర్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె.పద్మ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో స్థానికంగా జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించాలని, 1214 మెమోని తక్షణం రద్దు చేయాలని, 2019 నుంచి పెండింగ్లో పెట్టిన క్లైముల పరిహారాలను కార్మికులకు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం చలో భవన కార్మికుల చలో కలెక్టరేట్ ప్రసార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భవన కార్మికులు వాయలేటి అప్పారావు, జక్కిలింకి రాముడు, బాబురావు, నూకరాజు ,సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో కూడిన సేవలు అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి

రికార్డులను పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ నాయక్

రోగుల పట్ల అంకిత భావంతో కూడిన సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.నరసింహ నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భం గా సిబ్బంది హాజరు, ఒపి సేవలు, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, లాబరేటరీ, నర్సింగ్ స్టేషన్, ఫార్మసీ సేవలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశ్శారు. రోగులకు అంకితభావంతో సేవలు అందించాలన్నారు. ఆరోగ్యకేంద్రం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సురేంద్ర, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శర్మ, సిబ్బంది రూతమ్మ, చల్లారావు, ఈశ్వరమ్మ, హిమవతి, సౌజన్య, నాగార్జున, దేవి, ఉపేంద్రరాజు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న వెంకటరావు

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - రౌతులపూడి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజవర్గ ఇన్‌ఛార్జ్ ఉమ్మడి వెంకటరావు అన్నారు. మండలంలోని ఎన్ఎన్ పట్నం, ఎల్ఆర్ పాలెం. ఎన్‌వి నగరం,. బిబి పట్నం గ్రామాల్లో ఆదివారం ఆయన ఇంటింటా కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపాడు నియోజవర్గం నుంచి కాంగ్రెస్ అభ్య ర్థిగా పోటీ చేస్తున్నానని, తనకు ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వై.రాజా, కె.వీర గణేష్, చంద్రశేఖర్, వై.నరసింహమూర్తి, పాల్గొన్నారు.

నేడు యథావిధిగా జిల్లా స్థాయి స్పందన

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ కలెక్టరేట్ స్పందన హాలులో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు గమనించాలని కలెక్టర్ సూచించారు.

సైన్స్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - కాకినాడ

విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

సైన్స్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ అలపాటి శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, విబివిఆర్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఆదివారం వివేకానంద పార్కులో గ్రంథాలయంలో జరిగింది. జిల్లా స్థాయిలో విజ్ఞాన శాస్త్రంపై క్విజ్ పోటీలను, కాంతి పాఠ్యాంశంపై సైన్స్ ప్రయోగాలపై శిక్షణ ఇచ్చారు. జిల్లాలో 28 పాఠశాల నుంచి 146 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆర్థిక సామాజిక అభివృద్ధికి సైన్స్ సహకరిస్తుందన్నారు. ప్రకృతిలో అపారమైన వనరులు ఉన్నాయని, ఆ వనరుల వినియోగానికి సైన్స్ సహకరిస్తుందని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పరిశోధన పట్ల ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు. విశ్రాంత స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ దొమ్మేటి సుధాకర్ మాట్లాడుతూ మూఢ నమ్మకాలు లేని ప్రపంచాన్ని నిర్మించాలన్నారు. శాఖా గ్రంథాలయం పరిపాలనాధికారి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ శాస్త్ర పరిశోధనలు సామాజిక అభివృద్ధికి తోడ్పడతాయని తెలిపారు. క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, పిల్లి గోవిందరాజులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రయోగాలపై శిక్షణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సాంకేతిక మండలి జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్, పాఠ్యపుస్తక రచయిత కె. వెంకట్రావు కాంతి పాఠ్యాంశం పై చేసిన ప్రయోగాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. 32 ప్రయోగాలను చేసి చూపించారు. సమతలం, కుంభాకార, పుటాకార తలాలపై కాంతి పరావర్తనం సంబంధించిన వివిధ ప్రయోగాలు, పరావర్తనాలలో రకాలను తెలిపే కృత్యం, గాజు దిమ్మలో కాంతి వక్రీభవనం ప్రయోగం, కటకాలలో రకాలను వివరించే కత్యం, కుంభాకార, పుటాకార కటకాలలో కాంతి ఎలా ప్రయాణిస్తుందో వివరించు కృత్యం, కుంభాకార కటకానికి వస్తువు వివిధ దూరాలలో ఉన్నపుడు ప్రతిబింబాలు ఎక్కడ ఏర్పడాతాయి, వాటి స్థానాలు, లక్షణాలు తెలిపే కృత్యం, మానవుని కన్నులో కటకం, రెటీనా పనితీరు వివరించు కృత్యం, హ్రస్వ దృష్టి కంటి దోషంలో ప్రతిబింబం ఎక్కడ ఏర్పడుతుంది, దానికి నివారణ వంటి ప్రయోగాలను చేసి చూపించారు.

రూ.25 కోట్లతో రైల్వేస్టేషన్ అభివృద్ధి

ప్రజాశక్తి - సామర్లకోట



రైల్వేస్టేషన్ ఆధునీకరించే నమూనా చిత్రం

అను నిత్యం పెరుగుతున్న ప్రయాణికుల అవసరార్థం సామర్లకోట రైల్వే స్టేషన్‌ను రూ.25 కోట్లతో ఆధునీకరించనున్నట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రైల్వేస్టేషన్లో పూర్తిస్థాయిలో ఆధునీక రించుటకు కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు. రైల్వే స్టేషన్ ముందుభాగం ఆధునీకరణ, ప్లాట్‌ఫారాలు మార్చేందుకు, అదనపు కాలిబాట, వంతెన రెండు ఎస్క లేటర్లు, ప్రయాణికులు ఉపయో గించే ప్లాట్‌ఫారాలకు పూర్తిస్థాయిలో రేకుల షెడ్లు ఏర్పాటు, అదనపు మరుగుదొడ్లు, దివ్యాంగులకు వెయిటింగ్ హాలు, స్టేషన్ ఆవరణ ప్లాట్‌ఫారాలపై ఆధునిక సాంకేతిక దీపాల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ అభివృద్ధి పనులను పిఎం నరేంద్ర మోడీ సోమవారం ఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని తెలిపారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే సామర్లకోట రైల్వే స్టేషన్ రూపురేఖలు మారుతాయని చెప్పారు.

సమస్యల పరిష్కారంలో సచివాలయాల పాత్ర కీలకం

ప్రజాశక్తి - ఏలేశ్వరం



ఎంఎల్ఎను సత్కరిస్తున్న నాయకులు

గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారంలో సచివాలయ వ్యవస్థ కీలకంగా మారిందని ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని పేరవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రతి చిన్న పనికి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగకుండా సచివాలయ వ్యవస్థ దోహదం చేసిందన్నారు. అనంతరం తన సొంత డబ్బుతో టైల్స్ వేయించి సుందరీకరించిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి నీరుకొండ రామకుమారి, సర్పంచ్ బేరి సూర్యవతి, నాయకులు నీరుకొండ సత్యనారాయణ, బేరి అరవిందకుమార్, జై భీమ్ సంఘం పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



'వైసిపి విజయానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి - రౌతులపూడి

సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల సుబ్బారావు

రాబోయే ఎన్నికల్లో వైసిపి విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు అన్నారు. ఆదివారం మండల సచివాలయ కన్వీనర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన నవరత్నాలు హామీలనే కాకుండా అధిక శాతం పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. పేద బలహీన వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి మద్దతు పలికేలా కృషి చేయాలని సూచించారు. మండలంలోని గిడజాం గ్రామంలో బండారు బైరాగి ఆధ్వర్యంలో టిడిపికి 50 కుటుంబాలు వరుపుల సమక్షంలో వైసిపిలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి వరుపుల ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో శంఖవరం ఎంపిపి పర్వత రాజుబాబు, జడ్‌పిటిసి గోళ్ళ లక్ష్మణమూర్తి, వైసిపి మండల అధ్యక్షులు తాతాజీ, వైసిపి నాయకులు వాసిరెడ్డి జమీలు, పులి మధు, వాసిరెడ్డి భాస్కరబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి సామర్లకోట రైల్వే గేట్ మూసివేత

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 28 నుంచి మార్చి 6 వరకూ సామర్లకోట రైల్వే గేటును ట్రాక్ మరమ్మతులు నిమిత్తం మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాకినాడ నుంచి సామర్లకోట వెళ్లే ప్రజలు సామర్లకోట గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి మీద రెండు కిలోమీటర్ల అదనంగా ప్రయాణించి కాకినాడ రోడ్లోకి చేరుకోవాల్సి ఉంటుంది. అలాగే కాకినాడ నుంచి సామర్లకోట ఊర్లోకి వచ్చే ద్విచక్ర వాహనదారులు రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదగా స్టేషన్ సెంటర్ మీదుగా సామర్లకోటలోకి రావాల్సి ఉంటుంది. ఈ మేరకు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రామసుబ్బారావు తహశీల్దార్, సిఐలకు ట్రాఫిక్ డైవర్షన్ ఏర్పాట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని లేఖలు పంపారు. ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఉత్తర క్యాబిన్ రైల్వే గేట్‌ను మూసి వేస్తున్నట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్ ధ్రువీకరించారు.

క్లాస్‌ఫోర్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షునిగా గణేష్

ప్రజాశక్తి - పెద్దాపురం

జిల్లా క్లాస్‌ఫోర్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయం సభార్డినేట్ బి.గణేష్‌రావు ఎంపికయ్యారు. ఆదివారం కాకినాడలో జరిగిన క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ సమావేశంలో నూతన కమిటీ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా ఎన్నికల అధికారి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా గణేష్‌ను ఆర్‌డిఒ జె.సీతారామారావు, డిప్యూటీ తహశీల్దార్ భానుకుమార్ తదితరులు అభినందించారు.

దిగజారుడి రాజకీయాలు ద్వారంపూడికి పరిపాటి

ప్రజాశక్తి - కాకినాడ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

అధికారం కోసం దిగజారుడు రాజకీయాలు చేయడం ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి పరిపాటి అని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోసం కాకినాడ ఎంఎల్ఎ ద్వారంపూడి ఎంతటికైనా దిగజారు తున్నాడని, ప్రశాంత నగరంలో కులాల మధ్య, జాతుల మధ్య, మతాల మధ్య, చిచ్చులు రేపి ఘర్షణలు సృష్టించి లబ్ధిపొం దడానికి కుట్ర రాజకీయాలు చేస్తున్నాడని అన్నారు. మత్స్యకార జాతిని విమర్శించిన ద్వారంపూడి మత్స్యకార జాతికి బహిరంగ క్షమాపణ తెలపాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బీరక చంద్రశేఖర రావుపై దాడి చేసి ఘర్షణలు సృష్టించాడని, అదేవిధంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌పై బహిరంగంగా అసభ్యకరమైన దూషణలు చేస్తే జనసేన సైనికులు ప్రశాంతంగా తమ నిరసన చేపడతే వారిపై కర్రలతో రాళ్లతో దాడి చేయించి ఘర్షణలు సష్టించాడని ఆరోపించారు. ధన వ్యామోహంతో ద్వారంపూడి తన అనుచరులతో కాకినాడ నగరంలో విపరీతంగా గుట్కా, మట్కా, గంజాయి సరఫరా చేస్తూ యువత భవిష్యత్తును, కాకినాడ నగర ప్రతిష్టను పాడు చేస్తున్నాడని విమర్శించారు. ఈ సమావేశంలో నగర టిడిపి అధ్యక్షులు మల్లిపూడి వీరు, నాయకులు తుమ్మల రమేష్, గదుల సాయిబాబా, దండిప్రోలు నాగబాబు, సంఘాని నాగేశ్వరరావు, సుంకర దొరబాబు, గుత్తుల మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కోడిపందేల స్థావరంపై దాడులు

ప్రజాశక్తి-కాట్రేనికోన

కోడిపందేలే నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. కాట్రేనికోన పంచాయితీ పరిధిలోని చెయ్యేరు గురువు వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేశారు. ఆరుగురు వ్యక్తులతో పాటు రెండు కోళ్లు, ఆరు కత్తులు, రూ.2100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

రహస్య ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడిపందేల ప్రాంతంలోనే ఇరు వర్గాల మధ్య కోడిపందేల విషయమై ఘర్షణ చెలరేగింది. ఈ ఘర్షణలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కొట్టుకుని దిగడంతో బదుగు సతీష్ అనే వ్యక్తికి నడుముపై గాయాలయ్యాయి. కొంతమంది యువకులు గాయపడిన సతీష్‌ను ముమ్మిడివరంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి వైద్యం చేయించారు. ఈ ఘర్షణ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు తమకు అందలేదని ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని బాలాంత్రం గ్రామంలో శనివారం రాత్రి మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేశారు. ఇద్దరు యువకులు నలుపు రంగు పల్సర్ వాహనంపై వచ్చి బాలాంత్రం గ్రామంలో రోడ్డు పక్కన కిరాణా షాప్ పెట్టుకుని జీవిస్తున్న మహిళ మెడ నుండి రెండున్నర కాసుల బంగారు గొలుసు దొంగిలించుకుని యానాం వైపుగా పరారయ్యారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు ఎస్ఐ జానీ బాషా తెలిపారు.

శంకుస్థాపనలో పాల్గొన్న ఉపసర్పంచ్ తదితరులు

సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని రంప ఎర్రంపాలెంలో రూ.4లక్షల పంచాయతీ నిధులతో చేపట్టిన సిసి రోడ్డు పనులకు ఉపసర్పంచ్ దాకారపు ధర్మరాజు ఆధ్వర్యంలో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ సర్పంచ్ తొట్ల సత్యనారాయణ, బారంపుడి ప్రకాష్, సచివాలయం కన్వీనర్ దంగేటి వెంకటరత్నం, పిఎంసి చైర్మన్ గుప్త, గంట వెంకటేశ్వరరావు, పాలిప వెంకటరమణ తదితరులు హాజరయ్యారు.

బాబ్జిని పరామర్శిస్తున్న రాంజీ

బాబ్జికి తోట రాంజీ పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

అనారోగ్యంతో బాధపడుతున్న గంప బాబ్జిని మాజీ మంత్రి తోట నరసింహం తనయుడు తోట రాంజీ ఆదివారం పరామర్శించారు. ఇటీవల వెన్నెముక ఆపరేషన్ చేయించుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన గంప బాబ్జిని రాంజీ పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైసిపి నాయకులు సుంకర వీరబాబు, సొసైటీ అధ్యక్షుడు దాసరి చినబాబు, వైసిపి టౌన్ కన్వీనర్ వీర్ల వెంకటేశ్వర్లు, తోలేటి ప్రసాద్, ఆళ్లంక రాజా, అలమండ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జొన్నలగడ్డ

'విజయం కోసం కలిసి పనిచేద్దాం'

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

రానున్న ఎన్నికల్లో విజయం కోసం టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేద్దామని నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బారాయుడు అన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జొన్నలగడ్డ, కంటమణి రామకృష్ణ మాట్లాడారు. కొవ్వూరు నియోజకవర్గ సత్యాల వాటాలు, దీనిలో భాగంగా 28న తాడేపల్లిగూడెంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కొవ్వూరు జనసేన ఇన్చార్జ్, మాజీ ఎంఎల్ఎ టి.వి.రామారావు మాట్లాడుతూ టిడిపి, జనసేనలలో ఏ పార్టీకి సీటు వచ్చినా అందరూ కలిసి పనిచేద్దామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.చిన్ని, సూర్యదేవర రంజిత్, జనసేన పట్టణ అధ్యక్షులు దేగల రాము, మండల అధ్యక్షులు సుంకర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 16న ఎపిటిఎఫ్ 80 వసంతాల వేడుక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎపిటిఎఫ్ 80 వసంతాల వేడుకను ఏప్రిల్ 16న తాపేశ్వరంలో నిర్వహిస్తామని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కెవివి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని ఎస్కెవిటి నెహ్రూ నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సదాశివరావు బాధ్యులు సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయ బ్రహ్మం విచ్చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయుల ఉద్యమ మాతృ సంస్థ అని పేర్కొన్నారు. సదాశివరావు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1944 ఏప్రిల్ 16న స్థాపించారన్నారు.

ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు

ప్రజాశక్తితో డిఐఒ రత్నకుమార్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జాతీయ ఇమ్యూనైజేషన్ దినోత్సవం సందర్భంగా వచ్చే నెల మూడో తేదీన నేషనల్ పల్స్ పోలియో డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాకినాడ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.రత్నకుమార్ తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించుకోవాలని ఆయన సూచించారు. పోలియో చుక్కల కార్యక్రమానికి యాక్షన్ ప్లాన్‌ను ఇప్పటికే సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ కూడా అందించామన్నారు. జిల్లాలో ఇమ్యూనైజేషన్‌కు సంబంధించి ఆయన పలు అంశాలను ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ఎంతమందికి పోలియో చుక్కలు వేయనున్నారు.?

జిల్లాలో రూరల్ ఏరియాలో 15,33,399 మంది జనాభా పరిధిలో 1,19,012 మంది చిన్నారులకు, అర్బన్ ఏరియాలో 6,10,577 మంది జనాభా పరిధిలో 64,709 మంది పిల్లలకు మొత్తంగా 21,43,976 మంది జనాభా పరిధిలో 1,83,721 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

హైరిక్స్ ప్రాంతాలు ఎన్ని.?

జిల్లాలో 358 ప్రాంతాలను హైరిస్కు ప్రాంతాలుగా గుర్తించాం. 17,784 మంది పిల్లలు ఈ ప్రాంతాల పరిధిలో ఉన్నారు. వీరిలో రూరల్ ఏరియాలో 6,732 మంది, అర్బన్ ఏరియాలో 11,052 మంది ఉన్నారు.

ఎన్ని బూత్‌లను ఏర్పాటు చేశారు.?

మొత్తం 1319 బూత్‌లను ఏర్పాటు చేసాం. 125 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో 2,638 బృందాల్లో 5,276 మంది సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారు. 55 బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ముగ్గురు సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో 220 మంది సిబ్బంది పోలియో చుక్కలు వేయనున్నారు. హోప్ ఐలాండ్‌లో సుమారు 30 మంది పిల్లలు ఉన్నారు. పోర్ట్

అధికారి అనుమతితో అక్కడ పిల్లలకు కూడా చుక్కలు వేసేలా ఏర్పాట్లు చేశాం.

పిల్లలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.?

విద్యార్థులు వేళకు ఆహారం తినేలా, కంటి నిండా నిద్ర పోయేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలి. ఇతర విద్యార్థులతో పోల్చి హేళనగా మాట్లాడటం వంటివి చేయరాదు. వారి మనసు గాయపరిచేలా మాట్లాడటం వంటివి చేయరాదు. పిల్లల్లో ఆత్మస్థయిర్యాన్ని నింపాలి. వారిపై ఒత్తిడి పెంచరాదు. పరీక్షల సమయంలో పిల్లలతో తల్లిదండ్రులు తరచూ మాట్లాడాలి. చదువుపై ఏకాగ్రత కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆరోగ్యం బాగుంటేనే విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించగలరు.

ఇఎస్ఐ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి - కాకినాడ

శిలాఫలకం ఆవిష్కరణలో ఎంపి గీత, ఎంఎల్ఎ ద్వారంపూడి, ఇతరులు

అత్యాధునిక వసతులతో నిర్మించిన ఇఎస్ఐ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని ఎంపి వంగా గీత అన్నారు. ఆదివారం పిఎం నరేంద్రమోడి గుజరాత్ లోని రాజ్‌కోట్ నుంచి వర్చువల్ విధానంలో స్థానిక సాంబమూర్తినగర్‌లో రూ.జ114 కోట్ల వ్యయంతో నిర్మించిన 100 పడకల ఇఎస్ఐ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ పారిశ్రామిక, సేవా రంగాల్లో శరవేగంగా విస్తరిస్తున్న కాకినాడ ప్రాంతంలో కార్మికులకు ఆ ఆసుపత్రి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతంలో వైద్య సేవల కొరకు రాజమహేంద్రవరంలోని ఇఎస్ఐ ఆసుపత్రికి వెళ్లవలసి వచ్చేదని అన్నారు. అత్యాధునిక వసతులతో 100 పడకల అసుపత్రి పారంభం కావడంతో సుమారు 60 వేల మంది కార్మికులకు సంబంధించిన కుటుంబాలు ఇక్కడ వైద్య సేవలు పొందే అవకాశం వచ్చిందన్నారు. ఎన్నో అవరోధాలు, కరోనా సంక్షోభం ఎదురైనా అధిగమించి కేవలం 2 సంవత్సరాల్లోనే ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేసినందుకు ప్రాంతీయ కార్మిక కమిషనర్‌ను, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను ఎంపి ప్రత్యేకంగా అభినందించారు. ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ కాకినాడలో ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణంలో ఎంపీ వంగా గీత అలుపెరుగని కృషి చేశారని కొనియాడారు. కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు మాట్లాడుతూ కాకినాడలో నిర్మితిమైన ఇఎస్ఐ ఆసుపత్రి ద్వారా కోస్తా ప్రాంతంలోని కార్మికులకు మెరుగైన్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మాజీ ఎంఎల్‌సి నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ కార్మికులు వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండా కాకినాడలో ఆసుపత్రి ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, జెసి సివి.ప్రవీణ్ ఆదిత్య, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కె.కాశీ విశ్వనాథరాజు, జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్, సౌత్ జోన్ ఇన్సూరెన్స్ కమిషనర్ రాజేష్ కుమార్ కైమ్, కాకినాడ ఇఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాధిక, డిడి ఎం.పద్మప్రియ, వైద్యులు, ఇంజనీర్లు, ఇఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో యువత సాగాలి

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

ప్రజాశక్తి - కోటనందూరు

బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. ఆదివారము తుని పట్టణం ప్రధాన సెంటర్లో అంబేద్కర్ నూతన కాంస్య విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ ప్రపంచ మేధావిగా అంబేద్కర్ ఖ్యాతి సంపాదించారని అన్నారు. రాజ్యాంగం ద్వారా దేశము ఐక్యంగా ఉందని , రాజ్యాంగం లేకపోతే దేశమంతా ముక్కలు ముక్కలుగా చీలిపోయేదన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలణ సాధ్యమవుతుందనే అంబేద్కర్ ఆలోచనకు అనుగుణంగా సిఎం జగన్ విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో తుని పట్టణ చైర్‌పర్సన్ ఏలూరు సుధారాణి, బోడపాటి సతీష్, బోడపాటి శ్రీను, గరిసింగు దొరబాబు, జిగటాల వీరబాబు, జగటాల కోట సత్తిబాబు, బండి నాని బాబు, కృపానందం, గార శ్రీను పాల్గొన్నారు.

వెండి చీర బహూకరణ

వెండి చీరను అందిస్తున్న సూర్యనారాయణ కుటుంబం

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక శివాలయంలో భద్రకాళీ అమ్మ వారికి ఒక దాత వెండిచీరను బహూకరించారు. గ్రామానికి చెందిన వేదపండితులు దివంగత జొన్నలగడ్డ రామం కుమారుడు జొన్నలగడ్డ సూర్యనారాయణ రూ.3.50 లక్షల వ్యయంతో 3 కిలోల వెండితో తయారుచేసిన చీరను ఆయన మాతృమూర్తి భాస్కరమ్మ చేతుల మీదుగా అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి శివరామకృష్ణ, వేద పండితులు మర్ల ఫణిశర్మ బృందం సంప్రోక్షణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు కొలను సత్యన్నారాయణమూర్తి, చావలి రవి, ఈమని పురుషోత్తం, డింగిరిభట్ల అప్పలాచార్యులు, కందికొండ బాబి, వెంకట కష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

భరోసా ఇస్తేనే పార్టీలో కొనసాగుతా

ప్రజాశక్తి - సామర్లకోట

మీడియాతో మాట్లాడుతున్న రామస్వామి

నియోజకవర్గంలోని జనసేన కార్యకర్తలకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, టిడిపి అభ్యర్థి నిమ్మకాయల చిన్నరాజప్ప భరోసా ఇస్తేనే పార్టీలో కొనసాగుతానని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. జనసేన టిక్కెట్‌ను ఆశించిన తుమ్మల బాబు ఆదివారం పులిమేరులోని తన అతిథి గృహానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో అనేక పదవులు నిర్వహించానని, జనసేన ఆవిర్భావం నుంచి నియోజకవర్గం ప్రజలకు సేవ చేసే అవకాశం వస్తుందని నమ్మకంతో పార్టీలో కొనసాగడం జరిగిందని అన్నారు. సొంత ఆస్తులు అమ్ముకుని పార్టీని నడిపానని, ఏ రోజు ఎవరి దగ్గర చేయి చాపలేదని అన్నారు. నియోజకవర్గంలోని జనసేన పార్టీని నమ్ముకుని కార్యకర్తలు పని చేశారని వారందరికీ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. లేదంటే తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని అన్నారు. ఇప్పటివరకు పార్టీని నమ్ముకుని ఉన్న ప్రతి జన సైనికుడికి న్యాయం జరగాలని, లేదంటే సైనికుల కోసం ఎంతవరకైనా పోరాటం చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయన కన్నీరు పెట్టుకున్నారు. తుమ్మల బాబుకు పెద్దాపురం సీటు రాకపోవడంతో పలువురు జనసేన జిల్లా పదవులకు రాజీనామా చేశారు.

రజకుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - కాకినాడ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ద్వారంపూడి

రజక సామాజిక వర్గం సంక్షేమానికి కృషి చేస్తానని ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. స్థానిక 44వ డివిజన్ శారదాదేవి ఆలయం ప్రాంతంలో రూ.99.60 లక్షల నగరపాలక సంస్థ సాధారణ నిధులతో నిర్మించిన రజక కమ్యూనిటీ హాలు, గ్రౌండ్, మొదటి అంతస్తు కమ్యూనిటీహాలును ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో విలువైన స్థలాన్ని కబ్జాకు గురికాకుండా రజకులు కాపాడుకుంటూ వచ్చారని తెలిపారు. ఆ స్థలంలో కమ్యూనిటీ హాలును నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. గతంలో తాను ఎంఎల్ఎగా ఉన్న సమయంలోనే ఆ స్థలానికి ప్రహరి నిర్మించి రజకుల కోసం వృత్తిపరమైన సౌకర్యాలు కూడా కల్పించానన్నారు. కాకినాడ చీడీలపొర ప్రాంతంలో మరో కమ్యూనిటీ హాలును నిర్మించామని, అక్కడ రూ. 35లక్షలతో అదనపు అతస్తు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైసిపి నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎస్ఇ పి.సత్యకుమారి, బిసి సెల్ అధ్యక్షుడు అల్లి రాజబాబు, డిఇ సుబ్బారావు, ఎఇ వై.నాగేశ్వరరావు, రజక సంఘ ప్రతినిధులు పల్లంకి నూకరాజు, పొట్నూరి నారాయణరావు, గోడి వెంకట్, ఇరుసుమళ్ళ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సేవా నిలయానికి ఫ్యాన్‌ల వితరణ

ఫ్యాన్లను అందచేస్తున్న యోగా

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెనుగుదురు మాజీ సర్పంచ్ కొమ్ముజు శ్రీదేవి శ్రీనివాస్ కుమారుడు కొమ్ముజు యోగా మానవత్వం సేవా నిలయానికి 4 ఫ్యాన్లు అందజేశారు. ఈ మానవత్వం వ్యవస్థాపకులు జొన్నలగడ్డ రాజు మాట్లాడుతూ ఈ సాయాన్ని తమ సంస్థకు అందేలా కృషి చేసిన కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, కొమ్ముజు యోగలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చోడపునీడి చంటి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అధిక ధరలు పన్నుల మోత

టిడిపిలో చేరిన వారితో ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట

సిఎం జగన్ పేరు చెప్తే అధిక ధరలు పన్నుల మోత గుర్తుకు వస్తాయని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం స్థానిక 11వ వార్డు వీర్రాఘవపురంలోను, మండలంలోని వికె రాయపురం గ్రామాల్లో వివిధ పార్టీల నుంచి ఎస్‌సి, ఎస్‌టి, బిసి సామాజికవర్గాలకు చెందిన పలువురు టిడిపిలో చేరారు. వీరికి ఆయన టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచేయడానికి ప్రజలకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అభివృద్ధి పాలన ఎవరిదో...విధ్వంసపాలన ఎవరిదో రాబోయే ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్య కమిటీ చైర్మన్ చింతల రాజు టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే బాబు, యార్లగడ్డ చిన్ని, తోటకూర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాపులను జగన్ మోసగించారు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అభివాదం చేస్తున్న టిడిపి, జనసేన కాపు నాయకులు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాపులు, తూర్పు కాపులను మోసం చేసారని టిడిపి, జనసేన పార్టీ నేతలను అన్నారు. ఆదివారం జెఎన్ రోడ్డులోని జెకె గార్డెన్స్‌లో రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, టిఎన్‌టియుసి నగర అధ్యక్షులు నల్లం శ్రీను ఆధ్వర్యంలో టిడిపి నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు పర్యవేక్షణలో టిడిపి, జనసే పార్టీల కాపులు, తూర్పుకాపుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజమహేంద్రరం సిటీ నియోజకవర్గ టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ స్థానాన్ని తనకు కేటాయించిన టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబుకు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్‌కు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లకు ధన్యవాదాలు తెలిపారు. వారితో పాటు తనకు... తన కుటుంబానికి అన్ని వేళలా తోడుంటున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సీటు ఖరారైంది భరత్ రామ్, నీ సీటు చిరిగే రోజులు దగ్గరపడ్డాయంటూ హెచ్చరించారు. మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ కాపు కార్పొరేషన్ ద్వారా కాపులకు ఒక్క రూపాయి మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. జనసేన పార్టీ రాజమండ్రి ఇన్‌ఛార్జ్ అత్తి సత్యనారాయణ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం కాపులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. గత ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్‌ను కూడా జగన్ ప్రభుత్వం ఎత్తేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

పారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి కుమార్, ఎంఎల్ఎ అశోక్, మల్లాడి

జిప్‌మర్ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

జవహర్ లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్మెర్) మల్టీ స్పెషాలిటీ కన్సల్టింగ్ యూనిట్‌ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ పద్ధతిలో ఆదివారం ప్రారంభించారు. పుదుచ్చేరి జిప్మర్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ఎన్ దొర్రై రాజన్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి వ్యవసాయ శాఖ మంత్రి డిజె కుమార్, స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖలో ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన జిప్మెర్ సంస్థ వైద్య సేవలు ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిప్మర్ ఆసుపత్రితోపాటు, మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ యానాం జిప్మెర్ ఆసుపత్రి ఏర్పాటుకు కేంద్రప్రభుత్వానికి అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించానని తెలిపారు.

జిప్‌మర్ ఆసుపత్రి

ఆసుపత్రి అవసరాన్ని వివరించడంతో నిధులు మంజూరు చేసి త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేశారన్నారు. సభకు అధ్యక్షత వహించిన పుదుచ్చేరి జిప్మర్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ఎన్ దొర్రై రాజన్ మాట్లాడుతూ రూ.48.83 కోట్ల నిధులతో జిప్మెర్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఈ ఆసుపత్రి వల్ల యానాంతోపాటు తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, ప్రాణాంతక వ్యాధుల వైద్యానికి లక్షలాది రూపాయలు ఖర్చుచేయడంతోపాటు వందలాది కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి తప్పుతుందని అన్నారు. జిప్మర్ ఆసుపత్రిలో గుండె, కేన్సర్, ఊపిరితిత్తులు, కాలేయం తదితర దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, మెడికల్ ఆఫీసర్ దిలీప్‌కుమార్ మౌర్య, జిప్మర్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

యూనియన్ కార్యవర్గం ఏకగ్రీవం

నూతన కార్యవర్గ ప్రతినిధులు, కార్మికులు

ప్రజాశక్తి - యానాం

యానాం రైస్ మిల్స్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానిక రాజీవ్ గాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని అన్నారు. ఢిల్లీ కేంద్రంగా రైతాంగం చేస్తున్న పోరాటాన్ని మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా అణిచివేతకు పాల్పడుతుందని తెలిపారు. కార్మికులంతా ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నికైంది. యూనియన్ గౌరవ అధ్యక్షులుగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, అధ్యక్షులుగా సబ్బతి రాంబాబు, కార్యదర్శిగా తిరుకోటి శ్రీను, ఉపాధ్యక్షులుగా పిల్లి నూకరాజు, వై.అప్పారావు, సహాయ కార్యదర్శులుగా వాకలపల్లి వెంకటేశ్వరరావు, గుత్తాల బాలరాజు, కోశాధికారిగా వాసంశెట్టి అర్జున్‌రావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

జర్నలిస్టు మల్లేశ్వరరావుకు పలువురి పరామర్శ



వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజాశక్తి విలేకరి గుత్తుల మల్లేశ్వరరావును పలువురు పరామర్శించారు. ఆయన తండ్రి గుత్తుల వెంకటేశ్వరరావు ఇటీవల అకాల మరణం చెందగా ఆదివారం దశ దినకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్‌సాగర్, ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, స్థానిక సర్పంచి రెడ్డి అరుణ సుహాసిని దేవి, రెడ్డి బాబు, వైకాపా నాయకులు బర్రె లక్ష్మీ నరసింహ రాజు, బిల్లకుర్తి శ్రీనివాసరెడ్డి, బొంతు మోహన్, యర్రమనీడి అప్పారావు, కట్ట లింగమూర్తి, దెయ్యాల సత్యనారాయణ, ప్రజాశక్తి మేనేజర్ డి.శ్రీనివాస్, డివిజన్ ఇన్‌ఛార్జ్ శ్రీహరి, సిపిఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్, కెఎస్.శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వి.రాజుబాబు, టిడిపి, జనసేన నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి బాబి, నిమ్మకాయల మూర్తి, అత్తిలి బాబూరావు, గాడిమొగ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, మాతరాజు పరామర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రెండో రోజుకు సూర్యచంద్ర నిరవధిక దీక్ష

ప్రజాశక్తి-గోకవరం

పొత్తులో భాగంగా సీటు రాకపోవడాన్ని నిరసిస్తూ జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాటంశెట్టి సూర్యచంద్ర చేస్తున్న నిరవధిక దీఢ రెండో రోజుకు చేరకుంది. నాలుగు మండలాల జనసైనికులు దీక్షా శిబిరం వద్దకు చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా పాటంశెట్టి మాట్లాడారు. పొత్తు ధర్మానికి ఇప్పటికీ కట్టుబడే ఉన్నానని, తనకు జరిగిన అన్యాయానికి తన ఆత్మహత్యే పరిష్కారమనానరు. సాధారణ ప్రజలు రాజకీయాల్లోకి ఎప్పటికీ దూరమే అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పినట్లు డబ్బులు లేని రాజకీయాలకు ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కూడా కట్టుబడి లేడని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా ముకుమ్మడి రాజీనామాలకు సిద్ధంగా ఉన్నామని, 48 గంటల్లో అధిష్టానం నుంచి స్పందన రాకపోతే తమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.